


అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేస్తున్న గంగుల కమలాకర్, డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# .. అనే నేను శాసనసభ సభ్యుడిగా!

## అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

రాష్ట్ర శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు గానూ 11 మంది హాజరయ్యారు. ఇందులో బీఆర్ఎస్ నుంచి కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో ఎన్నికైన గంగుల కమలాకర్, డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కాంగ్రెస్ నుంచి మంథని, హుస్నాబాద్, మానకొండూర్, చొప్పదండి, వేములవాడ, పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల్లో ఎన్నికైన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. రామగుండం ఎమ్మెల్యే సింగరేణి కార్మికుడిగా దుస్తులు ధరించి, తలకు హెల్మెట్, తట్టా చెమ్మస్‌తో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాగా, సిరిసిల్ల, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికైన కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయలేదు.

**- కరీంనగర్, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**



అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేస్తున్న చింతకుంట విజయరమణారావు, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఆది శ్రీనివాస్



# చలో అమెరికా..





## పై చదువుల కోసం మన యువత పయనం

- కలల సౌధంపై ఉమ్మడి జిల్లా విద్యార్థుల ఆశలు
- నాడు మాస్టర్ డిగ్రీ కోసం..
- నేడు డిగ్రీ కోర్సుల కోసం యూఎస్ఏ బాట
- ఏటా 1500లకుపైగా వెళ్తున్న యువతీ యువకులు
- హైదరాబాద్ తర్వాత అత్యధికంగా మన జిల్లావాసులే
- అక్కడే స్థిరపడేందుకు మొగ్గు
- మున్ముందు మరింతగా పెరిగే అవకాశం

కరీంనగర్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఒకప్పుడు మన విద్యార్థులు మాస్టర్స్ చేయడానికి మాత్రమే ఎక్కువగా అమెరికా వెళ్లేది. కానీ, ఇప్పుడు ఆసక్తి, ఆర్థిక స్థోమతను బట్టి డిగ్రీ కోర్సులు సైతం చదడానికి వెళ్తుండడం కనిపిస్తున్నది. అంతేకాదు, అక్కడి విశ్వవిద్యాలయాలు అందిస్తున్న భిన్న కోర్సులు చేయడానికి మన పిల్లల నుంచి రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్నది. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ అండ్ అనలిటిక్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ వంటి కోర్సులపై మక్కువ చూపుతుండగా, ప్రధానంగా కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ ప్రోగ్రామ్‌లకు డిమాండ్ ఉంటున్నది. ఇంకా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి స్పెషలైజేషన్ కోర్సులకు కూడా క్రేజ్ ఉన్నది. మరోవైపు ప్రతి కంపెనీ.. తన అభివృద్ధి కోసం డాటాపై దృష్టి పెడుతూ.. ఈ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తుండగా, డేటా సైన్స్ అనలిటిక్స్ కోర్సులపై చాలా మంది విద్యార్థులు ఫోకస్ చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఎంబీఏ కోర్సులకు డిమాండ్ పెరుగుతుండగా, ఫైనాన్స్, మార్కెటింగ్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కోర్సులను చేసేందుకు సైతం ఆసక్తి చూపుతున్నారు. ఆర్థికంగా ఎదిగిన దేశమైన యూఎస్ఏలో ఈ రంగానికి సంబంధించి మంచి కోర్సులను అందిస్తుండగా, ఆర్థిక శాస్త్రం, ఫైనాన్స్ సంబంధిత విభాగాల్లో కోర్సులు చేసేందుకు వెళ్తున్నారు. ఇంకా హెల్త్‌కేర్, నర్సింగ్, ఫార్మసీ, పబ్లిక్ హెల్త్ విభాగంలో అత్యాధునిక కోర్సులను అందిస్తుండగా, వీటిపైనా దృష్టి పెడుతున్నారు. ఇంజినీరింగ్ విషయానికి వస్తే.. ఎలక్ట్రికల్, మెకానికల్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ చేయడానికి మక్కువ చూపుతున్నారు.



### సైకాలజీ, సైన్స్ కోర్సులపైనా ఆసక్తి

మానసిక ఆరోగ్య వృత్తిపైనా విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. సైకాలజీ, కౌన్సెలింగ్ కోర్సులు చేసేందుకు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. క్లినికల్ సైకాలజీ, కౌన్సెలింగ్‌తో సైకాలజీ ప్రోగ్రాంలకు ప్రసిద్ధిగాంచిన ఉన్న యూఎస్ఏలో ఆ కోర్సులు చేసేందుకు వెళ్తున్నారు. బయోటెక్నాలజీ, బయోమెడికల్ సైన్సెస్ రంగంలో ప్రముఖ పరిశోధన సంస్థలు ఇక్కడ అందుబాటులో ఉండగా, జన్యు ఇంజినీరింగ్, బయోఫిజిక్స్, బయో ఇన్ఫర్మేటిక్స్‌కు సంబంధించి డిగ్రీలను అభ్యసించడానికి ఆ దేశ బాట పడుతున్నారు. ఇలా విభిన్న కోర్సులను చదివేందుకు వెళ్తున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతున్నది.



### హైదరాబాద్ తర్వాత మనోళ్లే..

ఏటా రాష్ట్రం నుంచి అమెరికాకు వెళ్తున్న వారి సంఖ్య 15 వేలకు పైగానే ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో హైదరాబాద్ తర్వాత మన ఉమ్మడి జిల్లావాసులే అధికంగా ఉంటుండగా, అందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 13 ఇంజినీరింగ్ కళాశాలున్నాయి. అందులో రెండు ప్రభుత్వ, 11 ప్రైవేటు కళాశాలున్నాయి. అన్ని కోర్సులు కలిపి దాదాపు 4 వేల సీట్లున్నాయి. అలాగే, ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాది మంది విద్యార్థులు హైదరాబాద్‌లోని అనేక ఇంజినీరింగ్ కాలేజీల్లో చదువుతున్నారు. ఒక అంచనా ప్రకారం ఐదు వేల మంది ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నారు. అయితే, అమెరికా వెళ్తున్న వారిలో హైదరాబాద్ తర్వాత మన కరీంనగర్ జిల్లావాసులే అధిక సంఖ్యలో ఉంటున్నారు. న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్, డీసీ, కాలిఫోర్నియా, మిచిగాన్, తదితర రాష్ట్రాల్లో మన జిల్లాకు చెందిన వేలాది మంది చదువుతోపాటు ఉపాధి పొందుతున్నారు. 2000 సంవత్సరం నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతూ వస్తుండగా, తాజా అంచనాల ప్రకారం ఏటా ఉమ్మడి జిల్లా నుంచి పైచదువుల కోసం 1500 మంది వరకు వెళ్తున్నారు. ప్రస్తుతం అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో సీట్లు పొందిన విద్యార్థులు జనవరిలో చేరాల్సి ఉండగా, అందుకోసం ఇప్పటి నుంచే ఒక్కొక్కరిగా వెళ్తున్నారు. దీంతో విమానాలు రేట్లను సైతం అమాంతం పెంచారని విద్యార్థులు వాపోతున్నారు. ఏటా డిసెంబర్, జనవరి, జూలై, ఆగస్టులో విమాన చార్జీలు.. సాధారణ చార్జీలతో పోలిస్తే రెండు లేదా మూడింతలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.

### సీటు కోసం పోటాపోటీ

అమెరికాలో సుమారు 4500 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలున్నాయి. ర్యాంకింగ్ ఆధారంగా వాటిని టైర్-1, 2, 3గా వర్గీకరిస్తారు. వాస్తవానికి టైర్-1, 2లు 500కు మించి ఉండవన్నది నిపుణలు చెప్తున్న మాట. అక్కడి ప్రభుత్వ గుర్తింపు పొందిన కొన్ని సంస్థలు ఆయా విద్యాసంస్థలకు ర్యాంకింగ్ అక్రిడిటేషన్లు ఇస్తుంటాయి. అయితే, ప్రభుత్వ వర్సిటీలు నాణ్యమైనవి, ప్రైవేట్ నాసిరకమైనవి అని చెప్పలేమంటున్నారు నిపుణులు. కొన్ని స్కాలర్ షిప్‌లు మంజూరు చేస్తే.. మరికొన్ని మంజూరు చేయవని, ఆయా వర్సిటీల వెబ్‌సైట్లను, యూఎస్ కాన్సులేట్ వెబ్‌సైట్లను పరిశీలిస్తే పూర్తి అవగాహన వస్తుందని చెబుతున్నారు. అయితే, వీటిని ఆధారంగా చేసుకొని మెజార్టీ యువతీ యువకులు ఉన్నత విద్య కోసం అమెరికా బాట పడుతున్నారు. అక్కడ మంచి విశ్వవిద్యాలయంలో.. అనుకున్న కోర్సుల్లో చేరడానికి సీట్ల కోసం పోటీ పడుతున్నారు. ఒక్కో విద్యార్థి తాను డిగ్రీ పూర్తి చేసిన సంబంధిత విశ్వవిద్యాలయాలకు 5 నుంచి 10 ట్రాన్స్‌స్క్రిప్టుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. యూఎస్ఏ విశ్వవిద్యాలయాల దరఖాస్తుకు ఒరిజనల్ మార్కుల ధ్రువపత్రాలను పొందుపరచలేరు కావున.. రాష్ట్రంలోని ఆయా విశ్వవిద్యాయాల రిజిస్ట్రార్ లేదా పరీక్షల విభాగం అధికారులు సంతకం చేసిన ట్రాన్స్‌స్క్రిప్టులను విద్యార్థులు తీసుకుంటున్నారు. ఒక్కో విద్యార్థి 10 నుంచి 15 వరకు ట్రాన్స్‌స్క్రిప్టులు తీసుకుంటున్నారని ఆయా విశ్వవిద్యాయాల అధికారులు ప్రకటిస్తున్నారు. ఇవి తీసుకునే వారి సంఖ్య ఏయేటికాయేడు పెరుగుతున్నదని, దీనిని చూస్తే అమెరికా వెళ్లే వారి సంఖ్య ఎలా పెరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు.

### ఆరు నెలల ముందు ప్రిపేర్ కావాలి



అమెరికా వెళ్లి ఎంఎస్ చేయాలనుకునే యువత ఒక ఆరు నెలల నుంచి దాని కోసం ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. ఐఎల్ట్స్, జీఆర్ఈ పరీక్షకు ప్రిపేర్ కావాలి. ఆ పరీక్ష కోసం అవసరమైతే కోచింగ్ కూడా తీసుకోవాలి. ఆ దేశంలోని ప్రభుత్వ యూనివర్సిటీలకు అప్లై చేసుకునేందుకు 45 రోజుల సమయం మాత్రమే ఉంటుంది. యూనివర్సిటీలలో మంచి ఫ్యాకల్టీతో పాటు, అన్ని రకాల వసతులు అందుబాటులో ఉంటాయి. పరీక్షలు క్లియర్ చేసిన విద్యార్థులకు ఇప్పుడు ఎక్కువగా లోన్ విషయంలో ఇబ్బందులు వస్తుంటాయి. ఇందుకు ప్రధాన కారణం తల్లిదండ్రులకు ఐటీ రిటర్న్స్ లేకపోవడం. అలాంటి వారు ముందుగా ఒక ప్రణాళిక ప్రకారం వెళ్తే సులువుగా విదేశాలకు వెళ్లే అవకాశం ఉంటుంది.

**- గంజి అభిషేక్, సిగ్ ఓవర్సీస్, కరీంనగర్**

# జగిత్యాల గడ్డపై సంజయ్ జయభేరి

జగిత్యాల, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతూ ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ భుజం తట్టే తీరు. సంతోషంలో, ఆనందంలోనూ పాల్గొనే నైజం. పదేండ్ల కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం. స్వయంగా చేసిన ఆయన చేసిన స్వచ్ఛంద సేవలే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్‌ను రెండోసారి జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిపించాయి. దశాబ్దం క్రితం వరకు కాంగ్రెస్ కంచుకోటగా పేరుగాంచిన జగిత్యాల నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ అభేద్యదుర్గంగా మార్చివేసి, వరుసగా రెండోసారి సైతం జయకేతనాన్ని ఎగురవేశారు. మూడోసారి జగిత్యాల ఎమ్మెల్యేగా అభ్యర్థిగా బరిలోకి దిగి, తన సమీప ప్రత్యర్థి, సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డిని 15వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించి, వరుసగా రెండో విజయాన్ని కైవసం చేసుకున్నారు.

**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డిపై వరుసగా రెండోసారి విజయం**

- ఆది నుంచీ ప్రజల్లోనే డాక్టర్ సంజయ్ కుమార్
- పదవి ఉన్నా.. లేకున్నా జనంతోనే మమేకం
- నిత్యం వైద్యసాయం, ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు
- ప్రత్యర్థి గట్టినేత అయినప్పటికీ అలవోకగా గెలుపు

### నిరంతరం ప్రజలతోనే..

డాక్టర్ సంజయ్ కుమార్ నేత్రవైద్యుడిగా నిరంతరం ప్రజలతోనే ఉన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడినా.. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రజలకు అందుబాటులో ఉన్నారు. రౌండ్‌ది క్లాక్ ప్రజలకు ఏ సమస్య వచ్చినా 'నేనున్నా' అంటూ భరోసానిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రతి నిమిషం జాగురుకతతో వ్యవహరించారు. ప్రతి అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేశారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై 60వేలకు పై చిలుకు మెజార్టీతో విజయం సాధించారు. అప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలతో మరింతగా మమేకమయ్యారు. ప్రతి మండలంపై దృష్టిని సారించారు. అన్ని వర్గాలనూ కలుపుకొని పోయారు. సమస్యల పరిష్కారంపై ఫోకస్ పెట్టారు. రెండేళ్ల క్రితం భారీ వర్షాలు కురిసిన సమయంలో ఓ విలేకరి వాగులో కొట్టుకుపోగా, మృతదేహం దొరికే వరకూ అక్కడే ఉన్నారు. ఇలా ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నారు.

### కలిసివచ్చిన అభివృద్ధి.. సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రెండోసారి గెలుపులో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సైతం కలిసివచ్చాయి. నియోజకవర్గం రూపురేఖలు మార్చివేసిన అభివృద్ధి, ఆయన విజయాన్ని డిసైడ్ చేసింది. జగిత్యాలను జిల్లా కేంద్రంగా ప్రకటించడం, ధరూర్ క్యాంపులో దాదాపు ₹150 కోట్లు వెచ్చించి, కలెక్టరేట్, పోలీసు కార్యాలయం నిర్మించడం, జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడం, దానికి అనుబంధంగా 650 పడకల దవాఖాన ఏర్పాటు చేయడం, ₹511 కోట్లతో దవాఖాన, కళాశాల నిర్మాణం ప్రారంభించడం గెలుపునకు దోహదపడ్డాయి. వీటితోపాటు హైదరాబాద్ తర్వాత జగిత్యాలలోనే 4520 డబుల్ బెడ్రూం ఇండ్లను ₹300 కోట్లతో పూర్తి పంపిణీ చేయడం ₹50 కోట్లతో జగిత్యాల పట్టణాన్ని అభివృద్ధి చేయడం, మండలాల్లో అంతర్గత రోడ్లు, వంతెనలు నిర్మించడం, బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగును ₹135కోట్లతో ఆధునీకరించి సాగునీరు ఇవ్వడం కలిసివచ్చాయి. ఇంకా సంక్షేమ పథకాలు సైతం గొప్పగా పని చేశాయి. నియోజకవర్గ పరిధిలో 62వేల మందికి పెన్షన్లు నెలనెలా అందుతుండగా, తిన్నరేవును మరువద్దనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమైంది. వీటికి తోడు నియోజకవర్గవ్యాప్తంగా పలు మైనార్టీ, జనరల్ రెసిడెన్షియల్ కాలేజీలు, పాఠశాలలు ఏర్పాటయ్యాయి. 'మన ఊరు-మన బడి', 'మన బస్తీ - మన బడి' ద్వారా 64 ప్రభుత్వ పాఠశాలలు సర్వాంగ సుందరంగా తయారుకావడం సంజయ్‌కుమార్ గెలుపులో కీలక పాత్ర పోషించాయి. ఇక పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో చేపట్టిన అభివృద్ధి పనులు సైతం దోహదపడ్డాయి.



విజయ సంకేతం చూపుతున్న డాక్టర్ సంజయ్‌కుమార్

### రాజకీయ ధురందరుడిపై రెండోసారి విజయం

జగిత్యాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి గట్టిపట్టున్న నియోజకవర్గం. 1983 నుంచి ఇప్పటి వరకు జగిత్యాలలో కాంగ్రెస్ తరపున జీవన్‌రెడ్డినే పోటీ చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా విజయం సాధించిన విషయం తెలిసిందే. స్వరాష్ట్ర సాధన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ సంజయ్‌కుమార్ పోటీ పడ్డారు. ఆ ఎన్నికలో జీవన్‌రెడ్డి విజయం సాధించారు. సంజయ్ ఓడిపోయినప్పటికీ దిగులు పడకుండా నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చారు. దీంతో 2018లో జరిగిన ఎన్నికల్లో 60వేలకు పై చిలుకు మెజార్టీతో సంజయ్‌కుమార్ విజయం సాధించారు. అయితే ఈ సారి నియోజకవర్గంలో భిన్నమైన పరిస్థితులు ఆవిష్కృతమయ్యాయి. ఎమ్మెల్యేగా ఓడిపోయిన జీవన్‌రెడ్డి 2019లో శాసన మండలి సభ్యత్వం కోసం కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన నియోజకవర్గంలో పోటీ చేసి ఘన విజయం సాధించారు. 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జీవన్‌రెడ్డి గెలువడంతో ఆయనకు పార్టీలోనూ ప్రాధాన్యత పెరిగిపోయింది. 2023 ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో అందరి కంటే ముందుగానే జీవన్‌రెడ్డి పోటీకి సన్నద్ధమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ టికెట్ల కోసం దరఖాస్తు స్వీకరించగా, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి చెందిన కొడంగల్ నియోజకవర్గం, జగిత్యాల నియోజకవర్గంలో మాత్రమే రెండు దరఖాస్తులు ఉండడం గమనార్హం. మొదటి దఫాలోనే జగిత్యాల కాంగ్రెస్ టికెట్‌ను జీవన్‌రెడ్డికి కేటాయించారు. జీవన్‌రెడ్డి సైతం ఎన్నికల కోసం ముందు నుంచే ప్రచారాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ చుట్టివచ్చారు. నియోజకవర్గంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాటు చేయించారు. ఎన్నికల ప్రచార కీలక తరుణంలో ఏఐసీసీ కీలక నేత రాహుల్‌గాంధీతో సైతం జగిత్యాలలో సభను నిర్వహింపజేశారు. ఇక ఎన్నికల్లో గెలుపు కోసం శతవిధాలా ప్రయత్నించారు. బాండ్ పేపర్లు రాసి దేవుడి వద్ద ఉంచారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రచారం చేశారు. ఇన్ని చేసినా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ చేతిలో ఓడిపోయారు.

### స్వచ్ఛంద సేవతో మమేకం..

సంజయ్‌కుమార్ మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలతో కలిసిపోయారు. ఆది నుంచీ స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేశారు. ముఖ్యంగా నేత్ర వైద్యుడిగా సేవలందిస్తున్నారు. నియోజకవర్గం, జిల్లా పరిధిని దాటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. తాను చేయడంతో పాటు ఇతర నేత్రవైద్యులు, స్థానిక ఉన్న వైద్యులతో కలిసి శిబిరాలను నిర్వహించి, ఉచిత వైద్యసేవలు అందించారు. జగిత్యాల డివిజన్‌లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నేత్ర వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, పిల్లలను పరీక్షించి, ఉచితంగా మందులు, అద్దాలు అందజేస్తూ వచ్చారు. ఇంకా కంటి ఆపరేషన్లను సైతం ఉచితంగా చేపట్టారు. ఇప్పటి వరకు సంజయ్ 70వేల శస్త్రచికిత్సలు చేయగా, అందులో వేలాది శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు. రాజకీయ రంగంలోకి వచ్చి పదేండ్లు అవుతున్నా.. వారానికో రోజు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తూనే ఉన్నారు. ఏటా వెయ్యి శస్త్రచికిత్సలు ఉచితంగా చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. 'ఆపీ' ద్వారా ఆయన వైద్యసేవలు అందించారు. ఇలా స్వచ్ఛంద సేవతో ప్రజలకు చేరువయ్యారు.

### ప్రజల ఆదరణ జీవితంలో మరిచిపోను

నన్ను వరుసగా రెండోసారి గెలిపించిన జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంట. నాపై వారు చూసిన ఆదరణను జీవితంలో మరిచిపోను. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు కొంత భిన్నమైన ఫలితాలు వచ్చినప్పటికీ ఇక్కడి ప్రజలు పార్టీపైన, తనపై నమ్మకంతో గెలిపించడం నా అదృష్టం. పదేండ్లుగా ఇక్కడి ప్రజలతో మమేకమై ఉంటున్న. నిరంతరం అందుబాటులో ఉండి, వారి మంచి చెడులలో భాగస్వామ్యం కావడం వల్లే నాకు ఈ విజయం దక్కింది. పరిస్థితులు ఎలా ఉన్నా, ప్రభుత్వాలు ఏవైనా, జగిత్యాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే నాకు ముఖ్యం. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు శ్రమిస్త. అవసరమైతే పోరాడుత.

**- డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే**